# 'విధి వికటాట్టహాసం'

రచన:
సి. వి. రమణమూర్తి

వాసుదేవరావు ఆఖరిసారిగా సిగరెట్టుదమ్ము తీసి కసిగా విసిరేసాడు. వాసు మనస్సులోని ఆలోచనలే అందుకు కారణం. వేసవి కాలం ఎండ దంచేస్తున్నాది. అయినా వాసు నిర్లక్ష్యంగా అడుగులేస్తున్నాడు.

ఒక పచ్చరంగుమేడ పలుకరించింది. వాసు అదే గమ్యస్థానమని లోపలికి దారి తీశాడు. అది వాసుతండ్రి విశ్వేశ్వరంగారి మిత్రుడు ఈశ్వరరావుగారిది. ఈశ్వరరావు గారు స్థితిమంతులు. ఆయన కా మేడకాక యింకా స్థిరాస్తి పాతికెకరాల మాగాణి వుంది. ఆ ఆస్తి ఆయన తదనంతరం ఆయనకుమార్తె ఉమకి చెందుతుంది. ఉమకిప్పుడు పదహారేళ్ళుంటాయి. కళగానేవుంటుందిగాని కొంచెం నల్లగా వుంటుంది. విశ్వేశ్వరంగారు బ్రతికున్నప్పుడు వాసుని ఉమకిచ్చి పెళ్లిచేస్తే బాగుంటుందనే వారు ఈశ్వరరావుగారితో, ఈశ్వరయ్యగారికి వాసు బాగా చదువుకుంటాడు, బుద్ధిమంతుడవుతాడు అనే గట్టి నమ్మకం ఉండబట్టి మిత్రుని సలహాకు హర్షించేవారు. ఉమకుకూడా వాసు అంటే చాలా యిష్టం. అతని ఉంగరాలజుట్టు, దబ్బపండు వంటి వొళ్లు, క్లాసులో ఫస్టుగా ప్యాసవటం— ఇవన్నీ ఉమని ఆకర్షించటానికి అందుకు ముఖ్య కారణాలు.

వాసు పాటపాడితే ఉమ చెవికోసుకునేది. మళ్ళీపాడమంటూ బలవంతంచేసేది. వాసుకి మాత్రం ఉమ అంటే విసుగు. అంచేత "పో! నల్లమొద్దూ!" అని కసిరేవాడు. ఉమకప్పుడు ఎంతో దుఃఖం ముంచుకొచ్చేది. కొంచెం నల్లగా ఉండటం తప్పా? అనుకునేది.

వాసు హాలులో ప్రవేశించాడు. దూరాన్నుంచే ఉమ వాసుని చూసింది. మూడేళ్ళయింది ఉమ వాసునిచూసి. అప్పటికీ యిప్పటికీ ఎన్నో మార్పులు వచ్చాయి. ఉమ పెద్దమనిషి అయింది. యవ్వనఛాయ ఉమ మీదపడింది. సహజమైన ఏదో వినూత్నత్వం వాసు ఎదుటపడటానికి జేలగా చేస్తోంది ఉమని. వాసు అప్పుడింకా కుఱ్ఱాడిలా ఉండేవాడుగాని, ఇప్పుడు పెద్దయిపోయాడనుకుంది ఉమ. కాలేజీలో బి. కాం. ఫస్టుగా పాసయినాడని విన్న ఉమ ఉబ్బిపోయింది.

తులసమ్మకి పెద్దపెట్టున నైవేద్యంపెట్టి "వాసుని భర్తగా ప్రసాదించు తల్లీ!" అని మ్రొక్కుకుంది. రోజూ తులసిపూజచేస్తోంది వాసు చరణదాసికావలెనన్న దృఢవాంఛతో.

ఉమ తులసి పూజలూ, గుడికెళ్లటాలు చూసి, ఈశ్వరరావుగారు, అసలు విషయం ఊహించుకోలేకపోలేదు. ఆయన ఉమని చూసి ఆనందబాష్పాలు రాల్చారు. "పిచ్చి తల్లీ! వాసుని భర్తగాచేసేబాధ్యత నాది. అంత గాభరాపడాల్సిన అవసరమేముంది? అయినా వాసు పరాయివాడు గనుకనా? ఒకే కంచం, ఒకే మంచంలోనూ పాలుపంచుకున్న ప్రాణ మిత్రుని కొడుకు" అని మందలించేసరికి ఉమ సిగ్గుతో బుగ్గలెఱ్ఱచేసికొంది.

అప్పుడే మేడమెట్లుదిగుతున్న ఈశ్వరరావు గారు వాసునిచూసి సంతోషంతో తొందరగా వచ్చి, వాసుని డ్రాయింగురూములోకి తీసికెళ్లి కుర్చీలోకూర్చోపెట్టి, తనూ మరో కుర్చీలో కూర్చున్నారు.

"ఏం వాసూ? ఫస్టు వచ్చిందట మొన్న డిగ్రీపరీక్షల్లో?" అడిగారు ఈశ్వరరావుగారు కళ్ళజోడు సవరించుకుంటూ.

వాసు గంభీరంగా తలెత్తాడు. "ఔను" అని మాత్రం అన్నాడు.

కిటికీలోంచి ఉమ తనని చూస్తుండటం గమనించకపోలేదు. "వెర్రిపిల్ల" అని చిన్ననాటి ఆమెని తల్చుకుని నవ్వుకున్నాడు లోలోపల.

ఇంతలో కాఫీఫలహారాలు వచ్చాయి. వాసు కొంచెం ఫలహారం తీసుకొని కాఫీ పుచ్చుకున్నాడు. "అదేమిటోయ్! ఇదేం పరాయియిల్లా మొగమోటం పడతావేం? తిను మరింత!" అని అన్నారు ఈశ్వరరావుగారు తనకి కాబోయే అల్లుడని అనుకుంటూ.

వాసు "మొగమోట మెందుకండి?" అని గంభీరంగా ఓసారి మొహం రుమాలుతో తుడుచుకున్నాడు.

"నేనుద్యోగానికి 'ఎప్లయి'చేసాను. 'ధనలక్ష్మి బ్యాంకు'లో అసిస్టెంటు మానేజరుక్రింద సెలక్టు అయ్యాను" అన్నాడు వాసు.

"గుడ్! అయినా నీ కుద్యోగమెందుకోయ్ అప్పుడే? నేనున్నాగా?" అనన్నారు ఈశ్వరరావుగారు. వాసుకి అర్థమయింది ఈశ్వరరావు గారి ఉబలాటం. ఉమనిచ్చి కట్టబెట్టటానికి మొత్తానికి పెద్ద ఎత్తే ఎత్తారనుకున్నాడు. అయినా ఉమకంటె అందమయిన ఎవరి అమ్మాయినో ఉద్యోగంలో చేరాక ఘరానాగా చేసుకుందామని తన అభిలాష.

ఈశ్వరరావుగారితో కొంతసేపు మాట్లాడాక అన్నాడు "మీరు చెయ్యవలసిన సహాయం ఒకటే! అయిదు వేలు అప్పుగా యివ్వండి చాలు. ఉద్యోగానికి 'డిపాజిట్'గా కట్టాలి" ఈశ్వరరావుగారు కాసేపాగి అన్నారు. "ఐదు వేలే? ఏమిస్తారేమిటి వాళ్ళు!"

వాసుకి ఈశ్వరరావుగారిది అధికప్రసంగం క్రింద తోచిందిగాని నిరుత్సాహపరిస్తే అనలివ్వరేమోనని. "రెండు వందల యాభై యిస్తారు!" చెప్పటం యిష్టం లేకపోయినా చెప్పాడు.

ఈశ్వరరావుగారు ఆలోచనాముద్రలో మునిగారు కొంతసేపు. వాసు ఆశగా చూడసాగాడు. కిటికీవెనకనుంచి నిక్కిచూస్తున్న ఉమ మనస్సులో రైళ్ళుపరిగెడుతున్నాయి, నాన్న వాసు బావకి యిస్తానంటారో యివ్వనంటారో అని.

ఈశ్వరరావుగారు "ఇస్తాగాని నేనో చిన్న మాట అడుగుతున్నాను నువ్వుకూడా వప్పుకోక తప్పదు. మా ఉమని నీకిచ్చి పెళ్లిచేసి ఆ అయిదు వేలూ కట్నంక్రింద యిద్దామని వుంది" అన్నారు వాసు తనకోరిక మన్నించి తీరుతాడన్న ఆశతో. ఉమ మనస్సులో కెనేడియన్‌రైలు ధనధనలాడుతోంది. వాసు తనని పెళ్ళిచేసికోటానికి వప్పుకుంటాడో వప్పుకోడో నని అగ్నిపరీక్షకు సిద్ధమైనట్టు చూడసాగింది.

వాసు తల ఆడిస్తూ "ఈశ్వరరావుగారూ! మీ మాట కాదంటున్నందుకు మన్నించండి! నేను ఉమని పెళ్ళిచేసుకోలేను" అన్నాడు. ఉమ దీర్ఘంగా నిట్టూర్చింది.

ఈశ్వరరావుగారు కాసేపాగి సంకోచంగా "కాలేజీలో ఎవర్నయినా ప్రేమించావా?" అని అడిగారు.

వాసు మొహం చిట్లిస్తూ "అటువంటిదేమీ లేదండి. మీరివ్వదలిస్తే అప్పు యివ్వండి. నాలుగోవీధిలో మూడో నెంబరు యింట్లో ఉంటున్నాను. మీ కివ్వాలనిపిస్తే కబురు చేయండి. అనవసరప్రశ్నమాత్రం తేకండి!" అంటూ నమస్కారంచేస్తూ గబగబా బయటి కొచ్చేశాడు.

ఉమ మరి నించోలేకపోయింది. ఆమె హృదయంలో అగ్నిపర్వతం బ్రద్దలయింది. తన దైవమని నమ్మిన వాసునించి అటువంటి జవాబు తను కోరుకోలేదు సరికదా ఊహించ నైనా లేదు! తనగదిలోకిపోయి కుమిలికుమిలి యేడ్చింది.

*　　*　　*

వాసు జనసమ్మర్దంలో పోసాగాడు. అప్ప టికే వీధిలో దీపాలుపెట్టేసారు. కాకులు చివరి కూతలుకూస్తూ చెట్లమీదకు పోతున్నాయి. ఆకాశం కుంకుమ అరబోసినట్లుంది. ప్రకృతి చూస్తూ పది సిగరెట్లు తగలేసేసరికి ఎదుర్గా ఏదో గుంపు కన్పించింది. ఉమ తనని నమ్ము కుంది. అయినా తనకిప్పుడు డబ్బుకావాలి. లేకపోతే ఉద్యోగం దొరకదు సరికదా జీవ నాధారంకూడా కొఱత అవుతుంది. తనకు చెప్పుకోతగ్గ ఆస్తి లేనేలేదాయె! "సిరిరామోకా లొడ్డినవాడు" విషయం జ్ఞాపకం వచ్చింది.

గుంపు నెమ్మదిగా దగ్గరయింది. ఏమిటా అని తనూ వెళ్ళాడు. "అయిదు రూపాయిలు కట్టి లాటరీ నెగ్గితే అయిదువేలుట!" అన్నా డొక భారీ ఎత్తుమనిషి వసుప్రశ్నకి.

వాసు జేబులుతడిమాడు. రెండు అయిదు నోట్లు దొరికాయి. అవి తప్పించి తనదగ్గఱ మరి దమ్మిడీలేదు. సాహసంగా కట్టేస్తే.... ఒకవేళ రాకపోతే? తనా వూరినుంచి కదల టమే కష్టం!! వాసు అచేతనంగా అయిదు నోట్లిచ్చి చీటీ తీసాడు.

చీటీ విప్పసాగాడు. వాసుకళ్లు ఆత్రంగా దాని మీదున్న నెంబర్ని చూడసాగాయి. నెంబరు గెలిచింది! లాటరీవాడిగుడ్లు కప్పు కాఫీకగతిలేని కాబూలీవాడి మొహంఅయింది!!

అయిదు వేల రూపాయలకట్ట వాసు జేబు నలంకరించింది. వాసు గబగబా బయటి కొచ్చేసెడు ఆనందంగా. ఉద్యోగం తనకు దక్కించుకుంటూ గబగబా తన 'రూమ్'వేపు అడుగులేయసాగాడు. ఈశ్వరరావుగారు ఉమ గురించిన ఆలోచనలు గడ్డగా వున్నవి కాస్తా నీరయి దూరమైపోసాగాయి!

ఇంతలో వెనుకనుంచి "ఏమండీ!"అంటూ ఓ సన్నటిగొంతు విన్పించింది. వాసు వెనక్కి తిరిగిచూసాడు. ఎవరో ఒక అపరిచిత.... ఎల్లోరా విగ్రహంలా వంపులుతిరిగిన తీగలాటి సొగసైన సొగసులాడి....ఒకస్త్రీమూర్తి కన్పిం చింది. ఆమె అందం ఆఘ్రాణిస్తూ అలా నించొబడిపోయాడు. ఆమెచేతిలో ఓ ట్రంకు చిన్నదుంది.

ఆమె వయ్యారంగా వాసుదగ్గఱగావచ్చింది. వాసు వింతగా చూడసాగాడు. "నా పేరు వాణీకుమారి. ఈ ఊళ్ళో మా బంధువులున్నా రని వచ్చా. తీరాచూస్తే వాళ్లని కలుసుకోలేక పోయాను. ఈ ఊరసలే నాకు క్రొత్త. దయ చేసి మీ యింట్లో ఓ 'రూమ్' యిప్పిస్తే...." అంటూంటే వాసు తక్కింది ఊహించాడు.

"పదండి!" అన్నాడు ఏమీ తోచక. ఆమె ఎంత యిబ్బందిలో లేకపోతే తనని సాయం అర్థించింది అని అనుకున్నాడు. అయినా ఆమెను చూస్తుంటే కాదనలేకపోయాడు.

*　　*　　*

"మీరుంటున్నదీ ఒక్కగదిలోనేనా?" అని ప్రశ్నించిందామె పెట్టె దింపుతూ.

ఆమెపైటజారి యవ్వనపుహంగు వాసు కళ్ళకు జిగేల్‌మని తగిలింది. వాసు ఆలోచ నలో మునిగిపోయాడు కిటికీలోంచి బయటి చీకటిచూస్తూ.

వెనుకగా వాణి లేతచేతులు రబ్బరులాగా మెత్తగా వాసుమీద పడ్డాయి. వాసులో విద్యుచ్ఛక్తిదీపానికి 'స్విచ్' పడింది. వాసు వెనక్కి తిరిగాడు. వాణి తనలో లీనమైపోయింది.

తెల్లవారింది. కాకులగోల, కిటికీలోంచిపడే ఎండవేడిమి వాసుకళ్ళు తెరిపించాయి. ఎదు రింటి రేడియో చెవుల్ని గింగుర్లెత్తిస్తోంది.

వాణి గదిలో కనిపించలేదు. గాభరాగా చూసాడు నాలుగువేపులా. తలుపు దగ్గఱగా వేసివుంది. ఆమె పెట్టెకూడా కనిపించలేదు.

ఏదో భావం వాసు మెదడులో మెరిసింది. తొందరగా మంచందిగి 'స్టాండు'మున్న తన పాంటు జేబులు వెతుక్కోసాగాడు. ఒక్క నోటన్నది కన్పించలేదు!! ఆమె తనజేబులోని డబ్బు పసిగట్టి వెంటపడిందని తెలుసుకోటా నికి వాసుకి అట్టే సేపుపట్టలేదు.

"పోయింది....డబ్బుపోయింది" అంటూ పిచ్చిగా అరవసాగాడు. జీవనాధారం దొరికిం దంటే తనకు దెబ్బతగిలినట్టనిపించింది.

వాసు మంచంమీద వాలిపోయాడు జ్వరం కాసింది. వళ్లంతా పేలిపోతోంది. ఎవరూ లేరు తనకి మందూ అవీ యిప్పించి శ్రద్ధతీసు కోటానికి. రెండురోజులు దొర్లిపోయాయి.

*　　*　　*

మూడోరోజుకూడా జ్వరం తగ్గలేదు. ఎవరో వాసుకి ఎదురుగా నీడలా కన్పించారు. వాసు నిమీలితంగా చూశాడు. ఉమ కళ్ళనీళ్ళతో ఎదురుగ్గా కన్పించింది. ఉమ దుఃఖంతో మంచంమీద కూర్చుంటూ "ఏమండీ! ఎప్పు డొచ్చింది జ్వరం!" అంటూ కాళ్లుపట్టసాగింది. వాసుదేవరావు మనస్సుమారిపోయింది. ఉమ వేపు జాలిగా చూశాడు. "ఉమా!" అన్నాడు నీరసంగా.

"ఏమండీ!" అని ప్రశ్నించింది కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ.

"క్షమించు"

"అలా అనకండి" అంటూ కొంగుతో నీళ్ళు తుడుచుకోసాగింది.

ఇంతలో ఈశ్వరరావుగారుకూడా వచ్చారు. వాసుస్థితి విచారించారు.

*　　*　　*

నెలరోజుల్లో ఈశ్వరరావుగారి వాంఛితం యీడేరింది. వాసు - ఉమల వివాహం సలక్షణంగా జరిపించారు.

వాసు ఉమని తన వేపు లాక్కుంటూ "నీ పట్టే జయం లభించింది" విధి అడ్డం తిరిగింది. లేకపోతే నీ భర్త నవుదునా?" అన్నాడు.

"మీదేం గొప్ప? తులసితలిని పువ్వులతో పూజించాను. అంచేతే ఇదంతా జరిగింది" అంది.

"అయితే నేనేనా ముళ్లతో పూజించాను నల్లపెళ్లాం రావాలని?" అన్నాడు కొంటెగా. ఉమ వాసునోరు మూసేసింది. వాసు సౌఖ్యా లోకాలకి తీసుకుపోబడ్డాడు. గోడనున్న కేలం డరు ఇద్దర్నీచూసి గాలికి గోడకికొట్టుకుంటూ కరతాళధ్వనులుచేసింది. విధి వికటాట్ట హాసంచేసింది!!! ★